18 నుంచి పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - వల్లూరు

పుష్పగిరి క్షేత్రంలో శ్రీ కామాక్షి వైద్యనాధేశ్వర శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు 18 నుంచి ప్రారంభం అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ సమర్ధవంతంగా పనిచేసి విజయవంతం చేయాలని ఆలయ ఇఒ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పుష్పగిరి ఆయలంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో పుష్పగిరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వంటి సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గిరిప్రదక్షిణ గురించి ఎన్నో వదంతులు వస్తున్నాయని వాటి గురించి చర్చించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుమంత్, ఇంది రెడ్డి శంకర్ రెడ్డి, ఎర్రగుడిపాడు కేశవరెడ్డి, సతీష్ ,పుష్పగిరి గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం

చూడదము రారండి..

సర్వం సిద్ధం చేసిన టిటిడి, జిల్లా యంత్రాంగం

నేడు సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట విద్యుత్ దీపాలతో, ఆకాశమంత పందిళ్లతో కళకళలాడుతోంది. ఇప్పటికే రాష్ట్ర నలుమూల నుంచి స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు యాత్రికులు ఒంటిమిట్ట చేరుకున్నారు. కళ్యాణశోభను ఒంటిమిట్ట సంతరించుకుంది. రామనామ స్మరణతో ఏకశిలానగరం మారుమ్రోగుతోంది. విఐపిల రాక, పోలీసుల బందోబస్తుతో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు నూతన శోభను సంతరించుకుంది. ఏకశిలానగరిలో బుధవారం రాత్రి నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయం విద్యుత్ దీపపు ధగధగలతో దేదిప్యమానంగా ముస్తాబైంది. నభూతో నభవిష్యతి అనేరీతిలో విద్యుత్ కాంతుల మధ్య ఆకాశమంత చలువపందిళ్లతో కళకళ లాడుతోంది. రాష్ట్రం నలు మూలల నుంచి జగదబిరాముని కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు, యాత్రికులు, సేవకులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. జగదభిరాముని ఆలయంలోని దత్తమండపం, ధ్వజస్తంభం, కల్యాణవేదిక విద్యుత్ కాంతులతో కల్యాణశోభను సంతరించుకుంది. ప్రభుత్వం తరుపున కల్యాణోత్సవానికి దేవాదాయశాఖామంత్రి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో రానుండడంతో నూతనశోభ చోటు చేసుకుంది. పలువురు మంత్రులు, విఐపిలు రానున్నారు. సుమారు రెండు వేల మంది పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజునాటికి కల్యాణ ఘడియలు సమీపించడంతో పలువురు భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, సేవకులు కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట గ్రామ శివారులోని కల్యాణ వేదిక, దత్తమండపం, కోదండ రామాలయం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ప్రకాశిస్తోంది. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అడుగడుగునా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గతానికి భిన్నంగా భారీఎత్తున ప్రత్యేక బారీకేడ్లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని జయప్రదం చేయడానికి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లను చేయడం గమనార్హం. బుధవారం రాత్రి చంద్రుని వెన్నెల్లో జరిగే కల్యాణోత్సవానికి పలువురు దాతలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సీతారాముల కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం లక్షలాది మందికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేసింది.

రాములోరి కల్యాణోత్సవానికి ముస్తాబైన కల్యాణ వేదిక

గరుడ వాహనంపై సీతాపతి

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహన సేవ 9 గంటల వరకు జరగనుంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, మాన్యుస్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

బుధవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను మంగళవారం సమర్పించారు. 180 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం ఆరు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి నాలు గు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిభావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, ఆరేళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.



వైఎస్ఆర్ ఆసరా సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

మహిళా సాధికారతకు కృషి

ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా విశ్వసనీయతతో అన్ని సంక్షేమ పథకాలను అందిస్తోందని తద్వారా రాష్ట్రంలో మహిళాభివృద్ధి ఈ ప్రభుత్వం ద్వారానే సాధ్య మవుతుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. మంగళవారం స్కౌట్ హాల్ మైదానంలో నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో 3వ విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల ఖాతాలలో 18,525 మంది లబ్ధిదారులకు రూ.17 కోట్ల, 20 లక్షల, 51 వేలు జమ చేశామని పేర్కొన్నారు. నగర మేయర్ కె. సురేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ముందుకు వెళ్తోందని అన్నారు. గత ప్రభుత్వం లో ఇచ్చిన హామీలు ఏమాత్రం పాటిం చుకోలేదని జగనన్న ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి గ్రామ వార్డు సచివాలయాల ద్వారా వాలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 25 వేల కోట్లతో రుణమాఫీ చేశామని తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా వేల కోట్లతో పండుగ వాతావరణంలో మహిళల ఖాతాలలో జమ చేశామని చెప్పారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, నరపురెడ్డి సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు బాల కృష్ణా రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి, నిరం జన్ రెడ్డి, రామ లక్ష్మణ్ రెడ్డి, ప్రసాద్, కె. బాబు, కోఆప్షన్ సభ్యులు పత్తి రాజే శ్వరి ప్రసంగించారు. కార్యక్రమంలో ఇతర కార్పొరేటర్లు, వైసిపి నాయకులు ఎన్ఆర్ఐ తోట కృష్ణ, మహిళా నాయకులు, కో ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, లబ్ది పొందిన మహిళలు, సిఎంఎం హరిప్రసాద్ రెడ్డి, సిఒలు పాల్గొన్నారు. **బద్వేలు :** ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతను కల్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వైఎస్ఆర్ మూడవ విడత నిధుల విడుదల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. బద్వేల్ పురపాలక సంఘంలోని 1,045 స్వయం సహాయక సంఘాలకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా ద్వారా ఆర్థిక సాయం రూ. 8 కోట్ల 93 లక్షల 33 వేల చెక్కును అందజేశారు.

డబ్బులిచ్చి మోసపోకండి : డిఆర్ఒ

కడప : ఉద్యోగాల పేరుతో డబ్బులు ఇచ్చి ఎవరూ మోసపోవద్దని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటే ఆధారాలతో ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు జిల్లా రెవెన్యూ అధికారికి తగు ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసేవారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన ఎస్. గౌసియజిలాన్ అనే మహిళ ఉద్యోగం కోసం పొరుగు సేవల ద్వారా కలెక్టర్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న పి. శివప్రసాద్ అనే వ్యక్తికి రూ.35 లక్షలు ఇచ్చి మోసపోయారని, ఈ మేరకు ఆమె కలెక్టర్‌కు అర్జీ సమర్పించారని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి నిందితుడిని విధుల నుంచి తొలగించారన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి- కడప అర్బన్

పదో తరగతి పరీక్షలు ప్రారంభం రోజే పేపర్ లీకేజీ, డీబార్ వంటి వార్తల నేపథ్యంలో జిల్లాలో ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు నాయకులు కోరారు. మంగళవారం కడప,అన్నమయ్య జిల్లాల పదవ తరగతి రాష్ట్ర పరిశీలకులు, మోడల్ స్కూల్ ఆర్జెడి వెంకటకృష్ణారెడ్డి, డిఇఒ రాఘవరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడియస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ తెలుగు పరీక్ష రోజు బ్రహ్మంగారిమఠం, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. బాధ్యులు పైన కఠిన చర్యలు తీసుకుని పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. పరీక్షా కేంద్రాలలో బద్వేల్,పులివెందుల,అన్నమయ్య జిల్లాలో మదనపల్లె ,రైల్వేకోడూరు, పీలేరులో విద్యార్థినులకు చాలీచాలని మరుగుదొడ్లు కల్పించారని తాత్కాలికంగా మరిన్ని మరుగుదొడ్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్ తేజ, పిడియస్‌యు నగర నాయకులున రసింహ, సతీష్ పాల్గొన్నారు.

వైవీయూ ఆడిటోరియానికి 'సురభి' పేరు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా చరిత్రను విశ్వవిఖ్యాతం చేసి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన సురభి నాటక సమాజం రాబోయే తరానికి గుర్తుండిపోవాలని విశ్వవిద్యాలయంలోని హుమానిటీస్ భవనంలోని నూతన సమావేశ మందిరాన్ని 'సురభి మినీ ఆడిటోరియం'గా నామకరణం చేశామని వైసిపి ఆచార్య జింక రంగ జనార్ధన్ పేర్కొన్నారు. మంగళవారం రిజిస్ట్రార్ వెంటకసుబ్బయ్య, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డితో కలసి మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సురభి కళాకారులు మాతృభూమికి పేరు ప్రతిష్టలు తెచ్చారని వారిని నిత్యం స్మరించుకోవడం మన ధర్మమన్నారు. ఇటీవలే ఒక సెమినార్ హాలుకు ' కవయిత్రి మొల్ల సమావేశ మందిరం' గా నామకరణం చేశామని గుర్తు చేశారు. జిల్లా చరిత్రకారుల స్ఫూర్తి నేటితరం అందుకోవాలని అన్నారు. ఆడిటోరియంను ఆకర్షణీయంగా తయారుచేసిన విశ్వవిద్యాలయ ఇంజనీర్ ఎం.రాజశేఖర్ రెడ్డి బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో వైవీయూ డీన్ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

50 పడకల సీమాంక్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని రూ. 4 కోట్ల 40 లక్షలతో నిర్మించిన సీమాంక్ హాస్పిటల్ అప్ గ్రేడేషన్ ఆఫ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా మంగళవారం ప్రారంభించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓపి విభాగంతో పాటు విభాగాల వైద్య సేవలకు సంబంధించిన గదులను అడా చైర్మన్ గురు మోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, సగర కార్పొరేషన్ చైర్మన్ రమణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో సుందర్ రామిరెడ్డి, యద్దారెడ్డి, వైస్ చైర్మన్ సాయికృష్ణ, బంగారు సీనయ్య, డిసి హెచ్ఎస్ ఉమాదేవి, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

మెర్సీ జాస్పర్‌కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్విరాన్మెంటల్ సైన్స్ పరిశోధకురాలు పొట్టిపాడు మెర్సీ జాస్పర్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. విశ్వవిద్యాలయం ఎన్విరాన్మెంటల్ సైన్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్. సుమిత్ర పర్యవేక్షణలో, కో- గైడ్ బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎం. మాదక్క పర్యవేక్షణలో 'రిమూవల్ ఆఫ్ ఆనియోనిక్ అండ్ కే టయోనిక్ డైస్ బయోసార్బెంట్స్ అడ్సార్ప్షన్ డైనమిక్స్ అండ్ ఈక్విలిబ్రియం స్టడీస్' అనే అంశంపై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని ఆమె విశ్వ విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం, అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు. ఈ మేరకు ఆమెకు డాక్టరేట్ ప్రొసీడింగ్స్ ను పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఈశ్వర్ రెడ్డి జారీ చేశారు.

పారిశుద్ధ్యం పనులు పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

ఒంటిమిట్ట కోదండ రాముల వారి కళ్యాణం సందర్భంగా శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. విభాగ అధికారులతో కలిసి ప్రాంతాలను పరిశీలించి సూచనలను ఇచ్చారు. మంగళవారం ఎయిర్ పోర్ట్ నుంచి మొదలుకొని ఇర్కాన్ సర్కిల్, ఖాదర్ ఖాన్ కొట్టాలు, పాలెంపల్లి, దేవుని కడప జంక్షన్, బ్రహ్మయ్య పెట్రోల్ బంక్, వైఎస్ఆర్ సర్కిల్ వరకు రోడ్ డివైడర్స్ అన్నిటిని కూడా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రోడ్డు ఇరువైపులా సిఎన్‌డి వేస్ట్, పలు వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు.

స్వాతంత్ర్య సమరయోధులు జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమర యోధుడు, జనం కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. అంజనేయ ప్రసాద్ అన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో బాబు జగ్జీవన్ రామ్ 116 వ జయంతి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ పవన్ కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కో-ఆర్డినేటర్ మనోహర్, జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ ఆఫీసర్లు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వవిఖ్యాత నటు డు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న ప్రకటించాలని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి కోరారు. రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని రాష్ట్రపతికి పోస్ట్ కార్డు పంపించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ సినీ రంగంలో రాముడిగా, కృష్ణుడిగా, హీరోగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయ రంగ ప్రవేశం చేసి కిలో రెండు రూపాయల బియ్యాన్ని ప్రవేశపెట్టి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఇటువంటి నాయకుడికి భారతరత్న అవార్డును ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రఘునాధ రెడ్డి, ఓబుల్ రెడ్డి, విజయరెడ్డి, చోటు, బాషా పాల్గొన్నారు.



పోస్టు కార్డు రాస్తున్న లక్ష్మిరెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు

'జగనన్నే మా భవిష్యత్తు' ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

వైసిపి కడప నగర యువజన విభాగం అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో రూపొందించిన 'జగనన్నే మా భవిష్యత్తు' బ్యానర్లను ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, వైసిపి జిల్లా అధ్యక్షులు కె సురేష్ బాబు ఆవిష్కరించారు. మంగళవారం కడప నగరంలోని అపూర్వ కళ్యాణ మండపంలో కడప నియోజకవర్గం వైసిపి కార్పొరేటర్లు, జిల్లా, నగర నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరు జగనన్నే మా భవిష్యత్తు అన్న లక్ష్యంతో పనిచేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు.

3వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జిగా రవికుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని 3వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జిగా నంద్యాల రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి నగర ఇన్‌ఛార్జి విఎస్ అమీర్ బాబు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన టిడిపి నగర అధ్యక్షుడు సానపరెడ్డి శివకొండరెడ్డి, వి ఎస్ అమీర్ బాబు, టిడిపి నాయకులు నక్కల శివరాం, ఆమూరి బాలదాసు, బుర్రి రెడ్డయ్య యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి 3వ డివిజన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉండి టిడిపి అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. మూడో డివిజన్ ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా జయ చంద్రారెడ్డి, కార్యనిర్వాహన కార్యదర్శులుగా బత్తల రవీంద్ర, చల్లా సుధాకర్,బత్తల రామయ్య, వల్లెపు హరినాథ్, గండికోట దుర్గాప్రసాద్‌ను నియమించారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రాయచోటి

పదో తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల అబ్జర్వర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం పది పరీక్షలకు సంబంధించిన అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించామని చెప్పారు. పరీక్ష విధుల్లో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సహా సిబ్బంది తమ మొబైల్ ఫోన్లను ఇంట్లోనే ఉంచి రావాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏదైనా అక్రమాలు చోటు చేసుకుంటే చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులు, ఇన్విజిలేటర్లు బాధ్యత వహించాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలను తెరిచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి జవాబు పత్రాలను వరుస క్రమంలో తీసుకున్న తరువాత బయటకు పంపాలన్నారు. పరీక్ష హాల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, ఆన్సర్ స్లిప్స్ దొరికినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకసారి పరీక్ష కేంద్రంలోకి వచ్చిన సిబ్బంది పరీక్ష ముగిసే వరకు ఎటువంటి పరిస్థితుల్లో బయటికి పోకూడదన్నారు.

వన్‌స్టాప్ సిబ్బందికి సూచనలిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కడప సిటీ

మహిళా సమస్యలు ఎప్ప టికప్పుడూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి పేర్కొన్నారు. మంగళ వారం ఆమె వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్‌లోని రిజిస్టర్లను తనికీ చేశారు. మహిళల సమస్యలపై చర్చించి వారికి తగిన సూచనలు, సలహాలిచ్చారు. మహిళలకు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

నేటి నుంచి దర్గా ఉరుసు ప్రారంభం

ప్రజాశక్తి - కమలాపురం

ప్రభుత్వ లాంఛనాలతో కమలాపురంలోని హజరత్ అబ్దుల్ గఫార్ షా క్వాద్రీ దర్గా వార్షిక ఉరుసు ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గా పెద్దలు మాట్లాడుతూ ప్రభుత్వ లాంఛనాలతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎన్‌సిసి అధికారులు

ఆర్థిక సహకారానికి వేదిక గ్రూప్ ఆఫ్-20

ప్రజాశక్తి - కడప

గ్రూప్ ఆఫ్ -20 అంతర్జాతీయ ఆర్థిక సహ కారానికి ప్రధాన వేదిక అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డా. జి. రవీం ద్రనాథ్ అన్నారు. మం గళవారం కళాశాలలో ఎన్‌సిసి కేడెట్లకు గ్రూప్ ఆఫ్ 20, అందుకు సంబంధించిన అంశాల గురించి సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ 30 వరకు జి-20 అధ్యక్షత పదవి కలిగి ఉందని చెప్పారు. జి -20 సమ్మిట్ 2023 థీమ్ 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' అని తెలియజేశారు. ఈ జి -20 సమ్మిట్ పర్యావరణ మార్పులు, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, అంతర్జాతీయ వాణిజ్యం, శక్తి, మౌలిక సదుపాయాలు, మరిన్నింటితో సహా ప్రపంచ ఆర్థిక ఆందోళనలకు సంబంధించిన అనేక రకాల అంశాలను చర్చిస్తుందని అన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ మహేష్, పరేడ్ సిబ్బంది సుబేదార్ మేజర్ సహేంద్రసింగ్, బలవంత సింగ్ పాల్గొన్నారు.

ముమ్మడి కుటుంబాన్ని పరామర్శించిన వాసు

చెన్నూరు : ఐదుసార్లు సర్పంచ్‌గా పనిచేసిన శివాల్‌పల్లెకు చెందిన కీ.శే. ముమ్మడి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా పరామర్శించారు. మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారితోపాటు టిడిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు.

వైయస్ఆర్ ఆసరాతోనే ఆత్మస్థైర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైలవరం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతనిస్తున్నారని, తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా పథకంలో మూడో విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల బ్యాంకు ఖాతాలో నేరుగా మూడో విడత డబ్బులు వైఎస్ జగన్ జమ చేశారన్నారు. మైలవరం మండల వ్యాప్తంగా 562 స్వయం సహాయక సంఘాలకు మూడో విడతగా నాలుగు కోట్ల అరవై ఆరు లక్షల రూపాయలను ప్రభుత్వం మహిళల ఖాతాలో జమ చేసి ఆర్థిక ప్రయోజనం కలిగించిందన్నారు. ఎంపిపి సావిత్రమ్మ, జడ్‌పిటిసి మహాలక్ష్మి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివగురువిరెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచు జగదీశ్వర్‌రెడ్డి, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, జమ్మలమడుగు మార్కెట్ యార్డ్ చైర్మన్ పోచిరెడ్డి రమణారెడ్డి, వైస్ ఎంపిపి నాగ ఉదయిని, వైసిపి యువ నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆర్థిక సంవత్సర ప్రారంభంలోనే అప్పులు : పిసిసి

పజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో అప్పులతో ఆర్థిక సంవత్సరం ప్రారభంకావడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి పని దినమైన ఏప్రిల్ 3న రిజర్వు బ్యాంకు వద్ద రెండు కోట్ల రూపాయలు అప్పు చేయడం దురదృష్టకరమన్నారు. రిజర్వు బ్యాంకు వద్ద ఆర్థిక సంవత్సరంలో తొలి పని దినాన అప్పు చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గర్హనీయమన్నారు. జగన్ పాలనలో ఇప్పటికే రాష్ట్రం అప్పుల కుప్ప అయినట్లు చెప్పారు. 1956 నుంచి 2014 వరకు 58 సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1లక్ష కోట్లు కాగా, 2014 నుంచి 2019 వరకు అయిదేళ్ల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.1.50 లక్షల కోట్లు అన్నారు. 2019 నుంచి 2023 వరకు నాలుగు సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ.7.50 లక్షల కోట్లుగా వివరించారు. ఇంత అప్పు చేసినా సకాలంలో ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ కంటే ఉత్తరప్రదేశ్ 4రెట్లు పెద్దదని, జనాభా 23 కోట్లు కాగా అప్పు రూ.7లక్షల కోట్లు అన్నారు. ఆంధ్రప్రదేశ్ జనాభా 5కోట్లు అప్పు రూ.10 లక్షలు కోట్లు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి శ్రీలంక కంటే హీనంగా ఉందని తెలిపారు. శ్రీలంక జనాభా 2.5 కోట్లు కాగా అప్పు రూ.2.5 లక్షల కోట్లు అన్నారు. జగన్ ప్రభుత్వం ఓ వైపు అలవికాని అప్పులు చేస్తూ మరో వైపు పన్నులు, ధరలు పెంచుతూ ప్రజలపై భారం వేయడం గర్హనీయమ న్నారు. ఇప్పటికైనా ఆర్థిక క్రమశిక్షణను పాటించి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయవద్దని వైసిపి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కోరుతున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ప్రావీణ్యత హర్షణీయం

- ఉత్పత్తి ప్రదర్శనశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు

ఉత్పత్తి ప్రదర్శనశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మహిళలు అన్ని రంగాల్లో ప్రావీణ్యత పొందడం ఆనందదాయకమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా జగనన్న ఆసరా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పేదరిక జీవనోపాధుల ప్రదర్శన శాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉత్పత్తి రంగంలో ఉత్పాదకశక్తిని పెంపొందించుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తుండడం హర్షణీయమన్నారు. ఈ ప్రదర్శనశాలలో సుమారు వివిధ ఉత్పత్తులకు సంబంధించి 51 స్టాళ్లను ఏర్పాటు చేశారు. సిఎం జగన్ మహిళలకు మూడు విడతలుగా ఆసరా పథకం ద్వారా ఆర్థిక చేయూత కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, మెప్మా అధికారిణి కెజియా జాస్మిన్, కొత్తపల్లె సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు. మునిరెడ్డి, గరిసెపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబులరెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, రాజుపాలెం ఉప మండలాధ్యక్షులు యలవలి నారాయణరెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, కాకర్ల నాగశేషారెడ్డి, వంశీధర్‌రెడ్డి, శౌరీ సుభాష్‌రెడ్డి, రిలయన్స్ మాధవరెడ్డి, పిట్టా బాలాజీ, ఇర్ఫాన్ బాషా, మన్నే సత్యం, షేక్ జిలాని, రమణయ్య యాదవ్, కమాల్ బాషా, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కామిశెట్టి బాబు, శివరాం పాల్గొన్నారు.

వీధుల్లో నీటి నిల్వ లేకుండా చూడండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వీధుల్లో నీటి నిలువ లేకుండా చూడాలని వైసిపి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ ఆదేశించారు. పట్టణ పరిధిలోని చిన్న రంగాపురంలో మంగళవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి, వరప్రసాద్ మాట్లాడుతూ బిసి, ఎస్‌సి కాలనీలో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని, కాలనీలో పిచ్చి మొక్కలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిని కోరారు. భూగర్భ డ్రయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మెయిన్ రోడ్డు పక్కన వాటర్ ట్యాంక్ వద్ద ప్రభుత్వ భూమిలో వార్డు సచివాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శివలక్ష్మి, మున్సిపల్ డిఇ సుభాష్ చంద్రబోస్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎఇలు, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వీధుల్లో నీటి నిల్వను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

వినతిపత్రం అందజేస్తున్న ఎల్లయ్య మాదిగ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండు కూడలి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దారు సాయిసౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాదిగ మాట్లాడుతూ జస్టిస్ ఉశా మెహ్రా కమిషన్ నివేదిక ఆధారంగా పార్లమెంటులో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి పార్లమెంటుకు పంపారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా 41 సిఆర్‌పి రద్దు చేయాలన్నారు. పుల్లయ్య, ఓబులేసు, బాలఓబయ్య, ఆది, శ్రీకాంత్ పాల్గొన్నారు.

10న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో నెలకొన్న అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల10న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2007లో భూపంపిణీలో భాగంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అప్పటి ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేసిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలు మారినా లబ్ధిదారులకు భూ సర్వే చేసి చూపలేదన్నారు. ఆర్థిక, అధికార, అంగబలం లేని వారు భూముల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో భూ పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెబుతున్నా.. అందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు లోలోపల దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, బహిరంగంగా ఎక్కడా ప్రకటనలు చేయలేదని, ఇందులో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అసైన్‌మెంట్ కమిటీ నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే మండలంలో గతంలో మంజూరు చేసిన డికెటి భూములు చూపకుండా కొత్తగా భూములు పంచితే గ్రామాల్లో సమస్యలు తలెత్తుతాయన్నారు. దీన్ని అధికారులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు గోవింద్, రమణమ్మ, సునీల్. అజయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివకుమార్

అలుపెరుగని పోరాట యోధుడు ఎంవిఆర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అలుపెరుగని పోరాటయోధుడు ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవి రమణారెడ్డి అని విక్రమ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు శశిలం లక్ష్మీదేవి అన్నారు. డాక్టర్ ఎంవిఆర్ జయంతి సందర్భంగా వారి సహాయార్థం విక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమ కారుడు, రచయిత, రాయలసీమ పరిరక్షణ కోసం పాటుపడిన నాయకుడన్నారు. విక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పొందిన మహిళలు ఆనందవ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సునీత, మాజీ కౌన్సిలర్ గుమ్మయ్య, లోక్ సంస్థ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామిడి వీరయ్య యాదవ్, రవి యాదవ్, విక్రమ ఫౌండేషన్ సభ్యుడు దస్తగిరి, కొండారు వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

వెంకట్‌కు హార్ట్ అండ్ సోల్ అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రపతి అవార్డు గ్రహీత విభిన్న ప్రతిభావంతుడు ప్రొద్దుటూరుకు చెందిన వెంకట్‌కు ఇండియన్ ఐకాన్ సీజన్-2 నుండి హార్ట్ అండ్ సోల్ అవార్డు లభించింది. విభిన్న ప్రతిభావంతుడిగా జన్మించిన వెంకట్ తల్లిదండ్రుల శిక్షణలో అంచెలంచెలుగా ఎదిగిన విషయం పాఠకులకు తెలిసిందే. 2022 డిసెంబర్ 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా హార్ట్ అండ్ సోల్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ (లక్నో) వారు నిర్వహించిన ఆన్‌లైన్ పోటీలలో వెంకట్ అద్భుత ప్రదర్శనకు ఈ అవార్డు లభించినట్లు అతని తల్లిదండ్రులు విశాలాక్షి, రాఘవకృష్ణయ్య తెలిపారు. సొసైటీ వ్యవస్థాపక సభ్యులు మందాకిని బహుగుణ శాస్త్రి ప్రశంసాపత్రంతోపాటు వెంకట్ ముఖచిత్ర కవరు కొరియర్‌లో పంపించినట్లు వారు తెలిపారు. ఇండియన్ ఐకాన్ సీజన్-2లో అవార్డు లభించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రశంసాపత్రం, కప్పుతో వెంకట్

నక్కలదిన్నె పిహెచ్‌సికి వైద్యుల నియామకం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామం వద్ద నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో భాగంగా ఇద్దరు వైద్యాధికారులను నియమించినట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. డాక్టర్ కావ్య మాధురి, డాక్టర్ ఓబులేసును నియమించినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలం కూడా కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్, గ్రామానికి చెందిన శెట్టిపల్లె రామసుందర్‌రెడ్డి 1.12 ఎకరాలు వితరణ చేశారన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నియామకమైన వైద్య సిబ్బంది స్థానిక పిహెచ్‌సిలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

19 మంది ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 19 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. వీరిని మంగళవారం ట్రిపుల్ ఐటీలో డైరెక్టర్ సంధ్యారాణి అభినందించారు. హెటిరో డ్రగ్స్ అనే ఫార్మా కంపెనీ ఇటీవల రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. ఇంజనీరింగ్-4కు చెందిన 19 మంది విద్యార్థులు ఎంపిక చేసినట్లు తెలిపారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఛాన్సలర్ ప్రొఫెసర్ కెసి రెడ్డి, వైస్ ఛాన్సలర్ విజయ కుమార్ విద్యార్థులను అభినందించినట్లు ఆమె తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారులు నాగరత్న కిషోర్, సుందర్ శ్రీనివాస్, రవిబాబు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులకు ఆర్‌టిసి బస్సుల్లో అనుమతిలేదు

పులివెందుల రూరల్ : ఆర్‌టిసి బస్సుల్లో ప్రభుత్వ నిషేధిత వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతి లేదని డిపో మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్గోలో బుకింగ్ చేసుకునే ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి బుక్ చేస్తారన్నారు. కార్గో పార్సిల్‌పై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నిఘా పెంచారన్నారు. గుట్కాలు, సిగరెట్లు, గంజాయి, కల్తీ మద్యం, ప్రభుత్వ చౌక బియ్యం రవాణాను ఉపేక్షించేది లేదన్నారు. కార్గోలో పార్సిల్ బుక్ చేసేవారు తమ ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ కచ్చితంగా ఎంటర్ చేయాలన్నారు. కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిఎం కోరారు.

రూ.10 వేల నగదు అందజేత

పులివెందుల రూరల్ : స్థానిక నగిరిగుట్టకు చెందిన దండు రామస్వామి దేవాలయం సమీపంలో ఉంటున్న బాబయ్య అనే వ్యక్తి గత నెల 26న గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెల్ఫేర్ శ్రీనివాసులు, వాలంటీర్ విజయకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న, వైసిపి నాయకుడు వర్ధమానరెడ్డి మంగళవారం బాబయ్య నివాసానికి వెళ్లి వైఎస్ఆర్ బీమాకు సంబంధించి రూ.10వేలు ఆయన భార్య ఫక్రుబీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా పథకం కింద లక్ష రూపాయలు మంజూరవుతాయని, మొదటగా రూ.10వేలు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన మొత్తాన్ని ఖాతాలో జమ అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ బీమా చేసుకోవాలని వారు కోరారు.

ఇదే స్ఫూర్తిని కొనసాగించండి : కమిషనర్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను బకాయి వసూలులో 90 శాతం వసూలు చేసిన మున్సిపల్ రెవెన్యూ సిబ్బందిని మంగళవారం కమిషనర్ పగడాల జగన్నాథ్ ఘనంగా సత్కరించారు. వసూలు కాని బకాయిలను ప్రత్యేక శ్రద్ధతో రాబట్టిన ఆర్‌ఓ గంగిరెడ్డి, ఆయన బృందం సురేష్ రెడ్డి, చాంద్, సుదర్శన్‌రెడ్డి, రామిరెడ్డిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా బకాయిలు వసూలు చేయాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభుయ్య, ఎఇలు సురేష్, సందీప్, శానిటరి ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సిఐలు విమల, వసంత్, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

O.S.No.585/2022

Between:
షేక్ షక్షవలి ...వాది
మరియు
షేక్ హిమామ్ బీ మరియు ఇతరులు ...ప్రతివాదులు

To,
D2: షేక్ నాగుల్ బాషా & హైదర్ వలి, కె.యర్రగుంట (Vi&Po) వద్దూరుపేట మండలం, వైయస్సార్ కడప జిల్లా.
D3: షేక్ మహమ్మద్ & హైదర్ వలి, కె.యర్రగుంట (Vi&Po) వద్దూరుపేట మండలం, వైయస్సార్ కడప జిల్లా.

2 మరియు 3 ప్రతివాదులకు నోటీసులు

[illegible]

(కోర్టువారి ఆదేశాల మేరకు)

స్థలం:కదిరి
వాయిదా తేదీ:02-05-2023.

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఏ., బి.ఎల్.
వాదితరపు వకీలు
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

I.A.No.852/2022 in O.S.No.585/2022

Between:
షేక్ షక్షవలి ...పిటీషనర్
మరియు
షేక్ హిమామ్ బీ మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To,
R2: షేక్ నాగుల్ బాషా S/o హైదర్ వలి, కె.యర్రగుంట (Vi&Po) వద్దూరుపేట మండలం, వైయస్సార్ కడప జిల్లా.
R3: షేక్ మహమ్మద్ S/o హైదర్ వలి, కె.యర్రగుంట (Vi&Po) వద్దూరుపేట మండలం, వైయస్సార్ కడప జిల్లా.

2 మరియు 3 రెస్పాండెంట్లుకు నోటీసులు

[illegible]

(కోర్టువారి ఆదేశాల మేరకు)

స్థలం:కదిరి
వాయిదా తేదీ:02-05-2023.

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఏ., బి.ఎల్.
పిటీషనర్ తరపు వకీలు
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

ప్రతి వెల్‌నెస్ కేంద్రాల్లో బిపి, షుగర్ పరీక్షలు

ప్రజాశక్తి - అట్లూరు

మండలంలోని ప్రతి వెల్‌నెస్ కేంద్రాల్లో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించాలని డాక్టర్ కె. హమీదాబేగం అన్నారు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ అందరి సమన్వయంతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని, గర్భిణులకు పౌష్టికాహారం, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బ లక్షణాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం భాస్కర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీకృష్ణ, లక్ష్మీదేవి, మాణిక్యమ్మ, ఎఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ ఛాంపియన్‌గా 'శ్రీచైతన్య' విద్యార్థులు

ఛాంపియన్‌గా నిలిచిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - కడప

అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ -2023లో శ్రీ చైతన్య వరుసగా పదవ సంవత్సరం ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ నలుమూలల నుంచి సుమారు 30కి పైగా దేశాలు పాల్గొనగా దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో అందులో శ్రీ చైతన్య విద్యార్థులు నిలబెట్టారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. నాసా వారి ఎన్ఎస్ఎస్ కాంటెస్ట్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టులలో 80 మనదేశం నుంచి ఎంపిక అవగా అందులో 54 ప్రాజెక్టులు ఒక్క శ్రీ చైతన్య నుండే ఉండడం గర్వంగా ఉందన్నారు. అందులో ఎపి నుండి 18 ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. కడప జోన్ నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఎజిఎం రమణయ్య తెలిపారు. ఇంతటి అనితరసాధ్యమైన విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికీ శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు అభినందనలు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

పులివెందుల రూరల్ : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో కలిసి పని చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి దేరంగుల చంద్రమౌళి సూచించారు. స్థానిక ఎస్‌బిఐ కాలనీలో మంగళవారం వారికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం, నువ్వే జగనన్న కార్యక్రమాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, లక్ష్మీభార్గవి, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, నాయకులు రాజేష్, సంపత్ చందు పాల్గొన్నారు.

14 నుంచి ప్రచార పాదయాత్ర

కడప అర్బన్ : కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేకతను వైఫల్యాలను వివరించడానికి ఈనెల 14 నుండి మే 14 తేదీ వరకు సిపిఐ దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోరు ప్రచార పాదయాత్ర చేస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన పార్టీ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు పి.కృష్ణమూర్తి, ఎల్. నాగ సుబ్బారెడ్డి, సి. సుబ్రహ్మణ్యం, బషీరునిసా, చంద్రశేఖర్, వెంకట శివ, వేణుగోపాల్, విజయలక్ష్మి, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, బాదుల్లా, గంగా సురేష్, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - చాపాడు

మాట్లాడుతున్న మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్

గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు పోషక ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఓబులేసు, సిహెచ్ఒ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు భాస్కర్, రమేష్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం జవాబుదారీగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాస్వామ్యంలో ప్రజలకు సమాచారం ఇచ్చేందుకు అధికార యంత్రాంగం జవాబుదారీగా ఉండాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఉమ్మడి కడప జిల్లా జాయింట్ సెక్రటరీ రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కర్నూలులో జరిగిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా జాయింట్ సెక్రటరీగా తనను ఎన్నుకున్నట్లు చెప్పారు. సిసిఆర్ ఫౌండర్ అనిల్‌కుమార్, ఎపి ఇన్‌ఛార్జి ప్రసాద్, కర్నూలు ఇన్‌ఛార్జి దేవరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు, చర్యలు వంటి సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు సిసిఆర్ ఉపయోగపడుతుందని తెలిపారు. సమాచారం తెలుసుకోవడం ప్రజల హక్కు అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత అనేది ఉండాలని సూచించారు. ఈ దేశానికి పాలకులు, ప్రజలే నిజమైన హక్కుదారులన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రామచంద్ర పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వైసిపి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలుగు దేశం ప్రభుత్వానికి, వైసిపి ప్రభుత్వానికి ఉన్న తేడాను బేరీజు వేసుకోవాలన్నారు. జగన్ పాలనలో పేదలకు, మహిళలకు పథకాలు ఏ విధంగా ఉన్నాయో ఆలోచించుకొని, మంచి చేసిన వారిని ఆదరించాలని ఆయన కోరారు. పదవ వార్డులో ఉన్న రోడ్లు, డ్రయినేజీ, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, పదవ వార్డ్ కౌన్సిలర్ సలోమి, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు రిషికేశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, రాగిమాను చాంద్ బాబా అలీ, వేణు యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, డిఇ బాల మల్లేష్, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మోడీ కుట్ర నుంచి రాహుల్ విజయం

ప్రజాశక్తి -కడప

మోడీ కుట్ర నుంచి రాహుల్ గాంధీ విజయవంతంగా బయట పడతారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాబోయే ప్రధాని రాహుల్ గాంధీపై అనవసరమైన కేసులు పెట్టించి, దేశంలో ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలని మోడీ కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఈ కుట్రలేవి రాహుల్ గాంధీ వద్ద పనిచేయవని అన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షుడు చెప్పలి హరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నీలి శ్రీనివాసరావు

దాన దయాగుణాల కీర్తికిరీటి సి.కె.సంపత్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రౌన్ జ్ఞాపకార్థం భాషా పరిశోధన కేంద్రం ఉద్భవించడానికి ప్రధాన కారకులు దాన దయాగుణాల కీర్తికిరీటి సి.కె.సంపత్ కుమార్ అని వైవియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య జింక రంగ జనార్ధన పేర్కొన్నారు. వైవియు ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం స్థలదాత, ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ సి.కె.సంపత్ కుమార్ 21వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 1976లో సి.పి.బ్రౌన్ సాహిత్య యజ్ఞం జరిపిన స్థలంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని నిర్మించమని కోరారన్నారు. కలెక్టర్ డాక్టర్ పి.ఎల్.సంజీవరెడ్డి మరికొంత మంది రచయితలు కలసి స్థల యజమాని సి.ఆర్.కృష్ణస్వామిని కలిసి, శిథిలాలుగా ఉన్న బ్రౌన్ బంగళా 20 సెంట్ల స్థలాన్ని సి.పి.బ్రౌన్ జ్ఞాపకచిహ్నంగా నిర్మించే గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వమని కోరారని, సి.ఆర్.కృష్ణస్వామి పెద్దమనసుతో అంగీకరించడం విశేషమన్నారు. ఆయన మరణం తరువాత కుమారుడు సంపత్‌కుమార్ 1989 అక్టోబర్ 21న 20 సెంట్ల స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయం కోసం రిజిస్టర్ కూడా చేయించారన్నారు. ప్రస్తుతం ఆయన కుమార్తె సి.ఎస్.సుప్రజ గ్రంథాలయ విస్తరణ కోసం మరో 5 సెంట్లు బహూకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, పాఠకులు కొత్తపల్లి రామాంజనేయులు, జి.రంగ, యు.రాజేష్ కుమార్, కె.విజయ కుమారి, పి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో బొలేరో వాహనం ఢీకొని మల్లికార్జున (45) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాలు మేరకు.. వేముల మండలం భూమయ్యగారిపల్లెకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి మంగళవారం వేంపల్లెలో తన సొంత పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి సూపర్ ఎక్సెల్‌లో వెళుతుండగా, రాజీవ్‌నగర్ సమీపంలో వెనుక వస్తున్న బొలేరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో మల్లికార్జున ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతి చెందిన మల్లికార్జున